PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

బుధవారం 28-05-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 265 | WWW.MEKARTHI DINAPATRIKA.COM

## కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

**ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి**





మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం
రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
వర్చువల్ గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు.
తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు.

2లో

## ముగ్గురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామా



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన అన్నాడీఎంకే (ఘాఖాణవీఖ)కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సోమవారం ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, ఆ తర్వాత టీవీకే మంత్రి ఆదవ్ అర్జునను కలిశారు. మరగతం కుమారవేల్, జయకుమార్, సత్యభామ తమ రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు సమర్పించారు. పేజి 2లో ▶

## ప్రధాని మోదీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ



- దిల్లీలో ప్రధాని మోదీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ
- సేవా తీర్థ్‌లో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చ
- అటల్ స్మృతి న్యాస్ సొసైటీ చైర్మన్‌గా వెంకయ్యనాయుడు బాధ్యతలు

2లో

## కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్



హైదరాబాద్: బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదన్నారు. పేజి 2లో ▶

## అంతర్‌రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



- తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు చర్చలలో పూర్తి ప్రాధాన్యత
- పరస్పర అవగాహనతోటే కృష్ణా జలాల వినియోగం
- రెండు రాష్ట్రాల త్రాగునీటి అవసరాలపై కలిసి పోయే విదంగా చర్చలు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

నీటివినియోగంపై ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షణకు అనుకూలంగా ఉండే విధంగా రెండు రాష్ట్రాల మధ్యన ఒడంబడిక కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణా-కర్ణాటక రాష్ట్రల మధ్యన కృష్ణా జలాల వినియోగం, త్రాగు,సాగునీటి అవసరాలపై కర్ణాటక రాష్ట్ర చిన్ననీటి తరహా శాఖామంత్రి బోసురాజు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సోమవారం రోజు భేటి అయ్యారు. పేజి 2లో ▶

# డైమండ్ హార్బర్‌లో బిజెపి అడుగు

- గోదావరి పుష్కరాలకు 10కోట్ల మంది
- అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు ఉండాలి
- రాజమహేంద్రిలో అధికారులతో పవన్ సమీక్ష



గోదావరి పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, అందుకు తగిన విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల-2027 ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో పుష్కరాల ఏర్పాట్లపై రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పనులు ఎలా జరుగుతున్నాయని అధికారులను అడిగి డిప్యూటీ సీఎం తెలుసుకున్నారు. ఈ క్రమంలో అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అధికారుల పనితీరుపై డిప్యూటీ సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏడాది వ్యవధిలో రూ. 8,600 కోట్లతో చేపట్టాల్సిన పనులకు ఇంకా డీపీఆర్‌లు ఎందుకు సిద్ధం కాలేదని ప్రశ్నించారు. పేజి 2లో ▶

## బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

- ప్రతి ఇంటికీ మంచి నీరు అందించి తీరుతాం
- నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు ఒక్కటూనా కట్టారా
- అలా చూపిస్తే రాజకీయాల నుంచి తప్పకుంటా
- సర్ ప్రక్రియతో జాగ్రత్తగా ఉండాల్సిందే
- కూకట్‌పల్లి కార్యకర్తల భేటీలో బిఆర్ఎస్ నేత కెటిఆర్



మిగతాది 2లో

## అత్తారింట్లో విద్యుదాఘాతం.. అల్లుడి మృతి



ఆత్మకూరు (అమరచింత): అత్తారింట్లో శుభ కార్యానికి వచ్చిన అల్లుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లాలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. అమరచింత మండలం ఈర్లదిన్నె గ్రామానికి చెందిన ఆంజనేయులు (42) శనివారం ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలోని అత్తారింటికి వెళ్లారు. సోమవారం ఉదయం బావమరిది కుమారుడి తొట్టెల కార్యక్రమం ఉండటంతో ఇంటిని నీటితో శుభ్రం చేయడం కోసం నీరు అవసరమని మోటారు ఆన్ చేయడానికి బోర్డు వద్ద స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయి పడిపోయారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై జయన్న తెలిపారు.

## పద్మపురస్కారాన్ని స్వీకరించిన హర్మన్ ప్రీత్ కౌర్



2లో

## ఇశాన్వీ నుంచి బయటకు వచ్చాం

- నోటీసులపై 27న వివరణ ఇస్తాం
- విజయవాడ ఎంపి కేశినేని చిన్ని



2లో

# సంపాదకీయం

## ప్రతి కథా ఏకలవ్యుడి బొటన వేలే!




'ఎస్టీ కాలనీ' అని పిలవబడే ఒక ఎరుకుల సమూహాన్ని 'ఏకలవ్య కాలనీ'గా పిలుచుకోవడం వెనుక ఆ ఊరి యువత ఆలోచన బైటి నుంచి చూస్తే సాధారణమైనదిగా కనపడవచ్చు. కానీ పలమనేరు బాలాజి 'ఏకలవ్య కాలనీ -- ఎరుకల జీవనగాథలు' పుస్తకం చదివినాక ఆలోచిస్తే ఆ ప్రయత్నం మామూలుది కాదు అనిపిస్తుంది. స్వతంత్ర భారత దేశంలో మూలవాసులైన గిరిజనులపై వారి వారి జీవన విధానాల ఆధారంగా రాజ్యం రాసిన నెగెటివ్ హిస్టరీని రీరైట్ చెయ్యాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తాయి ఈ పుస్తకంలోని కథలు.

అడవి తీరప్రాంతాన, వ్యవసాయ ప్రధానంగా జీవనం సాగిస్తున్న ఒక ఆదిమ సమాజం దొంగలుగా చిత్రించబడటం ఒక కుట్ర. ఒక సమూహాన్నే వెలి వేయడం, నిర్లక్ష్యంగా పక్కన పెట్టడం ఒక వ్యూహం. అందులో భాగంగానే పాలకుల తీరు, ఇతర సమాజాల అణచివేత ఒక పథకం ప్రకారం జరుగు తున్నదని మనకు అర్థం చేయిస్తుంది ఈ పుస్తకం. ఈ కథల్లో ఒక కాలేజీ కుర్రాడు కొత్త ఫోను పట్టుకుని కాలేజీకి వెళ్తే "యాడ కొట్టుక్కొస్తివిరా ఇంత కొత్త ఫోను" అని ప్రశ్నిస్తుంది ఇతర సమాజం. అదే కథలో మరోచోట "మీకే మప్పా, మీరు దేవుడి బిడ్డలు. రిజర్వేషన్లున్నాయి" ఎత్తి పొడుస్తుంది. మరి స్వతంత్ర స్వర్ణోత్సవ సమయానికి ఈ పాత్ర తండ్రి ఎలా జీవించి వుంటాడు? ఎన్ని అవమానాల్ని ఎదుర్కొని వుండివుంటాడు? ఆ ముందు తరం ఏ మానసిక వేదనని మోస్తూ దాన్ని నేటి తరానికి వారసత్వంగా ఇచ్చి వుంటుంది? "అభివృద్ధి, మార్పు, సమానత్వం అనేవి రావడానికి ఇంకా ఎన్నేళ్ళు వెయిట్ చెయ్యాలి సార్?" అని మరో చోట ప్రశ్నిస్తుంది ఇదే కథలో మరో పాత్ర. ఈ మాటలో వెయిటింగ్ పట్ల అసహనం కనిపిస్తుంది. ఇది తరాల నిరీక్షణ.

ఈ పుస్తకంలో ఒక చోట ఆ ఎస్టీ కాలనీలో ఒక దృశ్యం పాఠకుడికి ఇలా ఎదురవుతుంది: "గుడి పక్కనే ఒక మొండి గోడల ఇల్లు... తలుపు సగం ఊడిపోయి, ఎప్పుడూ మూయాల్సిన అవసరమే లేనట్టు. బయటే నులక మంచం పైన ఒక సగం మనిషి కూర్చునో లేదా పడుకునో ఉంటాడు. పగల్లో కానీ, రాత్రుల్లో కానీ అతడు నిద్రలోకి వెళ్ళి వస్తుంటాడు. మెలకువలో కూర్చుని గుడ్డ పేలికలతో తాడు పేనడమో, వెదురు దబ్బల్తో తట్టో, బుట్టో, చాటో అల్లడమో చేస్తుంటాడు. రాత్రని, పగలని అతడికి స్పృహ ఉండదు. వానా, చలి, ఎండా ఏ తేడా తెలీదు. అతడి లోకం అతడిదే." ఈ వర్ణనతో అక్కడి దృశ్యం క్రమక్రమంగా మనకు స్పష్టమవుతూ కనిపిస్తూ వుంటుంది. అక్కడి మనుషుల జీవన విధానం, అక్కడి పరిస్థితులూ ఒక్కొక్కటిగా మనకు అర్థమవుతూ వుంటాయి.

ఇందులో ఆ "సగం మనిషి"ని మనకు చెప్పడానికి రచయిత అక్కడి మైన్యూట్ ఇష్యూస్‌ని కథలోకి తీసుకురావడాన్ని అభినందించకుండా వుండలేం. ఇలా చెప్పాలంటే ఆ రచయిత కచ్చితంగా ఆ కాలనీలో నివసించే వ్యక్తే అయి వుండాలి. లేదా అక్కడ జీవితాలతో ప్రత్యక్ష అనుబంధాలను కలిగి వుండాలి. లేకపోతే ఈ విధమైన నెరేషన్ వీలుకాదు.

ఇందులో ఒక పాత్ర మనతో చెప్తుంది: "ఒకరి బాధలు ఒకురికి చెప్పుకోవల్లంటే ఒకరి కష్టానికి ఒకురు రావల్లంటే అంతా ఒక్కచోట వుంటే మంచిది కదా వదినా" అని. ఎవరి బతుకు బాధల్లో వాళ్ళు ఎవరికి వారై వేరై పలుచోట్లకు పోతుంటే, ఎదురైన పీడనని ఎదుర్కోవడం సాధ్యం కాదనే స్పృహ అంతర్లీనంగా ధ్వనిస్తుందీ మాటల్లో. "పందుల్ని మేపినా, గాడిదల పైన ఉప్పు అమ్మినా, తట్టా బుట్టా అమ్మినా, యెర్రమన్ను, ముగ్గుపిండి అమ్మినా మనల్ని అడిగేవోడు లేదు. మన కాళ్ళపైన మనం నిలబడి మన కష్టం తింటూ ఉండామే కానీ ఉన్నప్పుడు తిని, లేనప్పుడు పస్తయినా వుండామే కానీ ఏ పొద్దూ ఎవరి సొత్తుకు అయినా పోతాండామా," అని అదే పాత్ర చెప్తూన్నపుడు మనకి ఆ మనుషుల బతుకు చిత్రాలు కనిపిస్తాయి. వృత్తులు స్పష్టమవుతాయి. కష్టాలు, కన్నీళ్ళు, బాధలు, బరువులూ అర్థమవుతాయి. "ఇప్పుడు వాళ్ళందరూ ముసలి వాళ్ళయిపోయారు, వాళ్ళను కదిలిస్తే చాలు కన్నీళ్ళు జలజలా నేల రాల్తాయి. బతుకుదారులు వేరైనా వాల్లందరివీ కంటికి కడవెడు కన్నీళ్ళు నింపుకున్న కతలే" అని రచయితే ఒక చోట అంటాడు. అతని మాటల్లో ఆ నేలరాలిన కన్నీళ్ళని రికార్డు చెయ్యాలనే తపన కనిపిస్తుంది. ఈ వ్యథలు బయటి ప్రపంచానికి తెలియచెప్పాలన్న సంకల్పం కనిపిస్తుంది. ఇదా మన భారతం అని ఎవరినో ప్రశ్నిస్తున్నట్టనిపిస్తుంది.

'ఏకలవ్య కాలనీ' సంపుటిలోని కథలన్నీ ఒక ప్రశ్నతో ముగుస్తాయి. ముగిసిన తరవాత పాఠకునిలో ఒక అలజడికి, ఆలోచనకి కారణమవుతాయి. ఈ ప్రశ్నలన్నీ పాఠకుడిలో ఒక మెలకువని కలిగిస్తాయి. అంటే కథ ముగిసిన తరువాత మథనం ప్రారంభమవుతుంది. అదే కదా సాహిత్యం అంతిమ లక్ష్యం. ఆ పని సులభంగా చేస్తాయీ కథలు.

ఇదంతా ఎందుకు చెప్పాల్సొన్నదంటే: ఇవన్నీ ఎరుకల కథలు. ఇంతదాకా ఎవరూ తడమనివి. తడిమినా ఇంత లోతుల్లోంచి చెప్పినవి కాదు. పలమనేరు బాలాజీ ఇప్పటికే కథకునిగా, కవిగా అందరికీ పరిచయమైనవారు. నా అంచనా తప్పు కాకపోతే ఆయన ఇంతకుముందు రాసిన పలు కథాకవిత్వాలకూ, ఈ పుస్తకానికీ స్పష్టమైన తేడా వుంది. అది అస్తిత్వ పరామర్శ. నా ఉద్దేశ్యం వాటిల్లో ఈ స్పృహ లేదని కాదు. ఇందులో బలంగా వున్నదని.

ఇన్నాళ్ళూ వివక్ష, అణచివేత, పీడనలు దళితజీవితాల్లో మాత్రమే ఉన్నాయ నుకునేది సమాజం. అంటరానితనం ఒక్క దళితులకు మాత్రమే ఎదురయ్యేది అనే అవగాహన వుండేది. కానీ అంటరానితనం గిరిజన కులాల్లో కూడా ఒక ముల్లులా గుచ్చుకుంటున్నదన్న వాస్తవాన్ని చెప్పే ప్రయత్నం చేసాయి ఈ కథలు. నొప్పిని భరిస్తున్న కమ్యునిటీస్ లోంచి ప్రశ్నించడం మొదలయ్యింది అని ప్రకటిస్తున్నాయి ఈ కథలు.

ఈ కథల్లో ఒక పాత్ర అంటుంది: "ఈ దేశానికి ఒక్క అంబేద్కర్ చాలదు. ఇంటికొక్క అంబేద్కర్ రావల్ల" అని. ఎనభైయ్యేళ్ళ ఆ పాత్ర అంబేద్కర్‌ని అణువణువునా జీర్ణించుకున్న ఉడుకోడు పాత్ర. "ఎరికిలోడు సేద్యం ఒక్కటే నేర్చుకుంటే సాలదు మామా, పోరాటం చెయ్యడం నేర్చుకోవల్ల, బతకాలంటే కరువుతోనే కాదు, మొండిమేఘాలతోనే కాదు, మొండి మనుషులతో, పెద్ద కులమోళ్ళతో పోరాటాలు చెయ్యడం నేర్చుకోవల్ల" అని ఉడుకోడు తోటి వారిని చైతన్యపరుస్తుంటే-- ఆ ఒక్క ఎస్టీ కాలనీకి చెందిన వారికే కాదు పీడితులందరికీ తత్వబోధ చేస్తున్నాడని మనకి ఇట్టే అర్థమైపోతుంది. "బతికేదానికి వయసుతో పనేముంది మామా, ఏ వయసోడికైనా బతకాలంటే నెత్తురు ఉడుగ్గానే ఉండల్ల. అసలు మనిషనేవాడు ఎప్పుడూ ఉడుకుడుగ్గానే ఉండల్ల," అని కుండబద్దలుకొట్టినట్టు చెప్తుంది ఉడుకోడు పాత్ర.

సాహిత్యలోకంలో బలహీనంగా వున్న గిరిజన స్వరం బృందగానంగా మారడానికి గొంతెత్తిన చైతన్యస్వరమీ కథలు. కథల్లో, కవితల్లో ఇప్పుడిప్పుడే గొంతు విప్పుతున్న గిరిజన గళాలకి ఈ కథలు మార్గనిర్దేశం చేస్తాయి. వివిధ ఉపకులాలుగా వున్న అడవి బిడ్డలకు ఈ కథలు కొత్త పాఠాలు నేర్పుతాయి. ప్రతి ఉపకులం నుంచీ ఇలాంటి కథలు రావాలన్న సందేశాన్ని పంపుతాయి.

# ఇశాన్వీ నుంచి బయటకు వచ్చాం

మొదటి పేజీ తరువాయి

ఇశాన్వీ, కేశినేని డెవలపర్స్ సనీస్థలు కలిసి చేసిన రియల్ ఎస్టేట్ సంస్థకు ఈడీ అధికారుల నుంచి ఓ నోటీసు వచ్చిందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఆ కంపెనీకి వచ్చిన నోటీసుపై ఈనెల 27వ తేదీన వివరణ ఇస్తామని పేర్కొన్నారు. పక్క పక్క సైట్లు ఉండటంతో రాజ్ కసిరెడ్డికి సంబంధించిన ఇశాన్వీ సంస్థతో 2021లో రియల్ ఎస్టేట్ చేసేందుకు ప్రైడ్ ఇన్‌ఫ్రా సంస్థ ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. ఆ సంస్థ ద్వారా రూ.35 లక్షల లావాదేవీలు జరిగాయని తెలిపారు. సోమవారం విజయవాడలో కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడారు. రాజ్ కసిరెడ్డి సంగతి తెలిశాక 2022లోనే.. ఆ కంపెనీ నుంచి బయటకు వచ్చేశామని కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. ఆ లావాదేవీకి సంబంధించే ఈడీ అధికారులు సమాధానం కోరుతూ నోటీసు పంపించారని వెల్లడించారు. ఆర్కిటెక్ ఫీజు కోసం చేసిన రూ.35లక్షల ట్రాన్సాక్షన్ తప్ప ఇంకేమి జరగలేదని ఈడీ అధికారులకు చెబుతామని తెలిపారు. లిక్కర్ స్కామ్‌లో తన భార్యకు నోటీసులు వచ్చినట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవమని అన్నారు. అప్పుడు పెట్టిన కంపెనీలో తన భార్య ఒక డైరెక్టర్ మాత్రమేనని తేల్చిచెప్పారు. ఆ కంపెనీకి నోటీసు వచ్చిందే తప్ప.. తన భార్యకు ఎలాంటి నోటీసు రాలేదని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

# కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్

మొదటి పేజీ తరువాయి

"వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. జూన్ 1న మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుడతాం. హైదరాబాద్‌లో 3 కార్పొరేషన్లలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించబోతున్నాం. అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. చెల్లి, బావ ఫోన్లు ట్యాప్ చేసిన కేటీఆర్‌కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత లేదు" అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.

# అంతర్‌రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

మొదటి పేజీ తరువాయి

భేటీలో రాష్ట్ర ఎక్సయిజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, క్రీడల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా శాఖా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి రాయచూరు లోకసభ సభ్యులు జీ. కుమార్ నాయక్,నాగర్ కర్నూల్ లోకసభ సభ్యులు మల్లు రవి లతో పాటు రాయచూరు రూరల్ శాసనసభ్యులు బసన్నగౌడ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,మేఘారెడ్డి,శివకుమార్ రెడ్డి,వంశీకృష్ణ,రాష్ట్ర నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ. ఎన్.సి రమేశ్ బాబు,కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖా కార్యదర్శి బి.కే పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో అనుసరించ బోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనాకారిగే ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా ఉండేలా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక చిన్న నీటి తరహా శాఖామంత్రి బోసురాజు కు సమగ్రంగా వివరించినట్లు ఆయన తెలిపారు.కృష్ణా నదిపై ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతికత అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణా సాగునీటి, త్రాగునీటి హక్కులు పరిరక్షణ భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధి విధానలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచినట్లు ఆయన చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు.సాగునీటి, త్రాగునీటి విషయంలో రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్ల కుండా ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విదంగా కృష్ణా జలాల వినియోగం పై కూలంకషంగా రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జాతిగాయని ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్యన జరిగిన చర్చలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వివరించి సమిష్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# పద్మపురస్కారాన్ని స్వీకరించిన హర్మన్ ప్రీత్ కౌర్

మొదటి పేజీ తరువాయి

ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాన్ని భారత మహిళల కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ స్వీకరించింది. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులు మీదుగా హర్మన్‌ప్రీత్ పద్మ శ్రీ అవార్డును అందుకున్నారు. టీమిండియా కలను సాకారం చేసి.. మహిళా క్రికెట్ వికాసానికి తోడ్పడిన ఆమెను ఈ సందర్భంగా ముర్ము అభినందించారు. పద్మశ్రీకి ఎంపికైన రోహిత్ శర్మ మాత్రం అవార్డు వేడుకలో కనిపించలేదు. నిరుడు సొంతగడ్డపై భారత జట్టుకు వన్డే ప్రపంచకప్ కట్టబెట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. 48 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ టీమిండియాను విశ్వవిజేతగా నిలిపింది. దిగ్గజ కెప్టెన్లు డయానా ఎడుల్జి, శాంత రామస్వామి, అంజుమ్ చోప్రా, మిథాలీ రాజ్ వంటి వాళ్లకు సాధ్యమవ్వని ఘనతను సొంతం చేసుకున్న కౌర్‌ను భారత ప్రభుత్వం పద్మ శ్రీతో సత్కరించింది. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం సంప్రదాయ దుస్తుల్లో హాజరైన హర్మన్‌ప్రీత్ ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము చేతులు మీదుగా అవార్డును అందుకుంది. నవంబర్ 2న జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించిన భారత జట్టు తొలిసారి జగజ్జేతగా అవతరించింది.

# బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్ సిటీలో 24 గంటల తాగునీటిని సరఫరా చేస్తామని మాజీమంత్రి కెటిఆర్ అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన తీరుగానే ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణకు 24 గంటల కరెంట్ ఇచ్చింది కేసీఆరే అని.. హైదరాబాద్ లో 24 గంటల తాగునీరు ఇచ్చేది కూడా కేసీఆరే అని వెల్లడించారు. కాంగ్రెస్ పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని మాజీ మంత్రి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, భవనాలను ఓపెన్ చేస్తూ తామే చేశామని అబద్ధాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో కేవలం అభివృద్ధిపైన మాత్రమే దృష్టి సారించామని.. ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీకి అండగా ఉన్న కార్యకర్త, నాయకుడికి తగిన అవకాశం, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

# ముగ్గురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామా

మొదటి పేజీ తరువాయి

ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో టీవీకే (ఎఖ) ప్రభుత్వానికి.. సీవీ షణ్ముగం నేతృత్వంలో 20 మందికి పైగా అన్నాడీఎంకే అసమ్మతి ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. వారిలో ఇప్పుడు రాజీనామా చేసిన వారు కూడా ఉన్నారు. దీంతో మదురాంతకం, ధారాపురం, పెరుందురై నియోజకవర్గాలు ఖాళీ అయ్యాయి. ఇప్పుడు మళ్లీ అక్కడ ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మాజీ సీఎం పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. వరుసగా రెండోసారి అధికారానికి దూరం కావడంతో పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తమైంది. దాంతో విజయ్‌కు మద్దతు ఇచ్చే విషయంలో పార్టీ రెండుగా చీలిన సంగతి తెలిసిందే.

# ప్రధాని మోదీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ

మొదటి పేజీ తరువాయి

దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ అయ్యారు. దిల్లీలోని సేవా తీర్థ్‌లో ఆయనతో సమావేశమయ్యారు. వెంకయ్యనాయుడు 2025 డిసెంబర్ నుంచి అటల్ స్మృతి న్యాస్ సొసైటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. దిల్లీలోని వాజ్‌పేయీ స్మారకమైన 'సదైవ్ అటల్' నిర్మాణం మొదలు ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలను కూడా ఈ సొసైటీనే చూస్తోంది. ఈ నేపథ్యంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ ఆలోచనలు, సిద్ధాంతాలు, విలువలను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు సొసైటీ తరపున రూపొందించుకోవాల్సిన విధివిధానాలపై ప్రధానితో వెంకయ్యనాయుడు చర్చించారు.

# డైమండ్ హార్బర్‌లో బిజెపి అడుగు

మొదటి పేజీ తరువాయి

ఒకే సంవత్సరంలో 7 వేల పనులను ఎలా పూర్తి చేస్తారని నిలదీశారు. ముఖ్యంగా పుష్కరాల నిర్వహణలో టూరిజం శాఖ నుంచి సరైన సన్నద్ధత ఎందుకు కనిపించడం లేదని మందలించారు. ఇష్టానుసారంగా ఖర్చు పెడదామని అనుకుంటే కేంద్రప్రభుత్వం నిధులు ఇవ్వదని స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధంగా, నాణ్యతతో పనులు చేయాలని దిశానిర్దేశర చేశారు. హడావిడిగా పాచిపోయిన సిమెంట్‌తో పనులు చేస్తే అవి కూలిపోతాయని హెచ్చరించారు. గత పుష్కరాల్లో జరిగిన తొక్కిసలాట వంటి ఘటనలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. గోదావరి పుష్కరాలు అంటే కేవలం రాజమండ్రికే పరిమితం కాదని, 6 జిల్లాల్లోని 274 పంచాయతీల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని ప్రాంతాల్లో భక్తులకు సమాన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పుష్కరాల పనుల సన్నద్ధతపై రాష్ట్ర కేబినెట్‌లో చర్చిస్తామని వెల్లడించారు. కేంద్ర నిధుల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్దకు వెళ్లే సమయంలో అన్నివిధాలుగా సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. గోదావరి నదిలో భక్తులు మురికినీళ్లలో స్నానం చేయడం సరికాదని పేర్కొన్నారు. గోదావరి కాలుష్య నివారణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. అలాగే, తూర్పుగోదావరి జిల్లా అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో గోదావరి నది కాలుష్యానికి కారణాలపై ఆరా తీశారు. క్లీన్ కృష్ణా, గోదావరి మిషన్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశ్రమ వ్యర్థాలు ఎట్టి పరిస్థితుల్లోనూ నదుల్లో కలవకూడదని హుకుం జారీ చేశారు. పరిశ్రమ వ్యర్థాలపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలుషిత నీరు సాగునీటి కాలువల్లో కలవకుండా చర్యలు చేపట్టాలని మార్గనిర్దేశర చేశారు. మురుగునీటిని శుద్ధి చేశాకే నదులు, కాలువల్లో కలపాలని సూచించారు. మురుగునీటి హాట్ స్పాట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని నిర్దేశిరచారు. కాలుష్య నివారణకు కలెక్టర్లు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీల్లో మురుగునీరు ఎందుకు శుద్ధి చేయట్లేదని ప్రశ్నించారు. మురుగునీటిని నేరుగా పంట కాలువల్లో ఎందుకు కలిపేస్తున్నారని నిలదీశారు. నదిలో, తాగునీటిలో మురుగునీటిని కలపడం సరికాదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

మొదటి పేజీ తరువాయి

ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని

ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు.

# బాల్యం ఆన్‌లైన్‌లో... ఆనందం ఆఫ్‌లైన్‌లో!

**- చిట్టి చేతుల్లో చాక్లెట్ కాదు... మొబైల్ ఫోన్లు...**
**- జోలపాటల్ని మింగేసిన మొబైల్ శబ్దాలు...**
**- బయట ప్రపంచం మూసేసి... స్క్రీన్ ప్రపంచంలో పిల్లలు...**
**- చిన్ననాటి జ్ఞాపకాలు తగ్గి... డిజిటల్ అలవాట్లు పెరిగి...**
**- ఆటల మైదానాలు వెలవెల... మొబైల్ స్క్రీన్లు కళకళ...**

మేకార్తి దినపత్రిక మే 26

ముస్తాబాద్ మండల రిపోర్టర్

ఒకప్పుడు ఇంటి ముందర మట్టి వాసనతో,అమ్మ జోలపాటలతో,తాతయ్య కథలతో పిల్లల బాల్యం కళకళలాడేది."జాబిల్లి రావే కొండెక్కి రావే", "జో అచ్చుతానందో జోజో" అంటూ తల్లులు పిల్లలకు అన్నం తినిపిస్తూ,నిద్రపుచ్చే రోజులు ప్రతి ఇంటిలో కనిపించేవి.సాయంత్రం అయితే వీధులన్నీ పిల్లల ఆటల సందడితో మార్మోగేవి. కర్రబిళ్ల, గోటీలు, చిర్రగోనె, దాగుడుమూతలు వంటి ఆటలు చిన్ననాటి జ్ఞాపకాలుగా నిలిచిపోయాయి. కానీ కాలం మారింది...ఇప్పుడు పిల్లల చేతిలో పుస్తకాలకంటే మొబైల్ ఫోన్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి.బయట



ఆడుకునే పిల్లలు తగ్గిపోయి,స్క్రీన్ ముందు గంటల తరబడి కూర్చునే పరిస్థితి ఏర్పడింది.ముఖ్యంగా పబ్జి వంటి అనవసర గేమ్స్,సోషల్ మీడియా యాప్స్




పిల్లల మనసులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తినడం..నిద్ర కూడా మొబైల్ ఆధారమే...

చాలా కుటుంబాల్లో పిల్లలు మొబైల్ చూస్తేనే అన్నం తినే పరిస్థితి ఏర్పడింది.ఫోన్ లేకపోతే ఏడవడం,కోపపడటం,నిద్రపోకపోవడం సాధారణమైపోయింది.దీంతో పిల్లల్లో ఏకాగ్రత లోపం,కంటి సమస్యలు,మానసిక ఒత్తిడి,చిరాకు,ఒంటరితనం వంటి సమస్యలు పెరుగుతున్నాయి.చిన్న వయస్సులోనే డిజిటల్ బానిసత్వానికి గురవుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది.




## వేసవి సెలవులు.. పిల్లలకు కొత్త దారి చూపాల్సిన సమయం...

ప్రస్తుతం వేసవి సెలవులు కొనసాగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లలను మొబైల్ ప్రపంచం నుంచి బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు సూచిస్తున్నారు.ఉదయం వ్యాయామం,పుస్తక పఠనం,కథల వినిపించడం,చిత్రలేఖనం,చెస్,క్యారమ్స్,సంప్రదాయ ఆటలు వంటి వాటి వైపు పిల్లలను మళ్లించాలి అంటున్నారు.ఇంట్లో పెద్దలు పిల్లలతో సమయం గడిపితేనే వారిలో ఆత్మీయత,ఆనందం పెరుగుతుందని చెబుతున్నారు.




## బాల్యం ఒక్కసారే వస్తుంది...

పిల్లల బాల్యం తిరిగి రాని అమూల్యమైన దశ. ఆ దశను మొబైల్ స్క్రీన్‌లకు పరిమితం చేయకుండా, ప్రకృతితో, ఆటలతో, కుటుంబ ప్రేమతో నింపాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. టెక్నాలజీ అవసరమే అయినా, అది పిల్లల జీవితాన్ని నియంత్రించే స్థాయికి వెళ్లకుండా జాగ్రత్తపడాలి. చిన్ననాటి మధుర జ్ఞాపకాలు, నవ్వులు, ఆటల సందడి మళ్లీ పిల్లల జీవితాల్లో నింపితేనే నిజమైన ఆనందమైన బాల్యం తిరిగి వస్తుంది.



## న్యూ ఢిల్లీలో జస్టిస్ బాలకృష్ణ కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీ కి వినతి పత్రం అందజేత.

**- ఉస్మానియావిశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నతానియల్.**
**- దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి.**

మేకార్తి దినపత్రిక మే 26 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని న్యూఢిల్లీలో జస్టిస్ బాలకృష్ణ కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ ని కలిసి ప్రొఫెసర్ నతానియల్ ఉస్మానియా విశ్వవిద్యాలయం వినతి పత్రం అందజేశారు. గత 76 సంవత్సరాలుగా దళిత క్రైస్తవులు ఎన్నో విధాలుగా నష్టపోయారు. మతం మారినంత మాత్రాన కులం మార్చవలసిన అవసరం లేదని కులం పరంగా రావాల్సిన రాయితీలు యధావిధిగా అందజేయాలని రాజ్యాంగం ఆర్టికల్ 25 ప్రకారం మతపరమైన స్వేచ్ఛ ప్రతి పౌరునికి కల్పించాలని ఆర్టికల్ 14 15 ప్రకారం భారత ప్రతి పౌరునికి స్వేచ్ఛ స్వతంత్రాలు ఉండాలని ఆ నివేదికలో కోరారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు రవీందర్ జైన్మరియు ప్రొఫెసర్ సుష్మా యాదవ్ దళిత క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై ఇచ్చిన వివరణ విన్నారు. చివరిగా 1950 ఆగస్టు 10 తారీకు నాడు ఇచ్చిన ప్రెసిడెంట్ ఆర్డర్ లోని పేరా తొలగించాలని కోరారు. 2026 జూన్ 10 తారీకు నాడు జస్టిస్ బాలకృష్ణ కమిషన్ సమర్పించే నివేదికలో సానుకూల నివేదిక ఇవ్వాలని వినయంగా విన్నవించారు.

## ఎల్లమ్మ తల్లి దయతో ప్రజలంతా శుభిక్షంగా ఉండాలి.

మేకార్తి దినపత్రిక మే 26 సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ పాపని స్వామి ప్రతినిధి.



సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రీ ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవ మహోత్సవంలో దుబ్బాక నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్) గార్లు పాల్గొని ఎల్లమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం వారు మాట్లాడుతూ ఎల్లమ్మ దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సంతోషాలతో, పాడిపంటలతో అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నారు. వారిని గౌడ్ సంఘం పెద్దలు సన్మానం చేశారు.కార్యక్రమంలో గౌడ్ సంఘం పెద్దలు,నాయకులు పాగాల కొండల్ రెడ్డి, పంది రాజు, బెజ్జనబోయిన అనిల్,బండారు రమేష్ గౌడ్,సంతోష్,ప్రవీణ్,స్వామి, భారత్ తేజ,భాను చందర్, తదితరులు పాల్గొన్నారు.

# ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం

**- అదానీ,అంబానీ ల కోసం తప్ప ప్రజలకు మోడీ చేసింది ఏం లేదు**
**- జాతీయ రహదారిపై రాస్తారోకో**
**- CPM జిల్లా కమిటి సభ్యులు కొంగరి వెంకట్ మావో**

మేకార్తి దినపత్రిక మే 26 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచి కేంద్ర బిజెపి ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తుందని, అదానీ,అంబానీ ల కోసం తప్ప ప్రజలకు మోడీ చేసింది ఎం లేదని జూవీ సిద్దిపేట జిల్లా కమిటి సభ్యులు కొంగరి వెంకట్ మావో అన్నారు,మంగళవారం చేర్యాల పాత బస్టాండ్ వద్ద పెంచిన పెట్రోల్, డీజిల్ ధరల ను తగ్గించాలని డిమాండ్ చేస్తు జూవీ పార్టీ చేర్యాల మండల డ పట్టణ కమిటీల అధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించడం జరిగింది,ఈ సందర్భంగా వెంకట్ మావో మాట్లాడుతూ,



ప్రధాని నరేంద్ర మోడీ విదేశాల్లో పర్యటనలే తప్పా స్వదేశంలో ప్రజలు పడుతున్న బాధలను పట్టించుకోవడం లేదని అన్నారు,వారంలో 4 సార్లు పెట్రోల్, డీజిల్ పెరిగాయని, మొన్న జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల తర్వాత విపరీతంగా ధరలు పెంచి ప్రజలకు వాతలు పెట్టడం అన్యాయమన్నారు. పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచేలా ధరలు పెంచుతున్న మోదీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని ఆయన డిమాండ్ చేశారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుతున్న కూడా దేశంలో బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాల న్నారు. చమురు కంపెనీలు నష్టాలలో ఉన్నాయని పెట్రోల్ ధరలు పెంచుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు,పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన ప్రధాని నరేంద్ర మోడీ అంబానీ, అదానీలకు అనుకూలంగా పరిపాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి కైన పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు,లేనిచో జూవీ పార్టీ అధ్వర్యంలో ప్రజలందరినీ ఏకం చేసి ఆందోళన,పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో జూవీ చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్, చుంచనకోట సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ , పట్టణ కమిటి సభ్యులు అముదాల నర్సిరెడ్డి, ముస్త్యాల ప్రభాకర్,మండల కమిటి సభ్యులు నాగపురి కనకయ్య, మోకు ఇంద్రసేనరెడ్డి, స్వర్గం శ్రీకాంత్, నాయకులు నంగి మైస్సయ్య,తుప్పతి రాజు, పండుగ యాదగిరి, ఆవుల చంద్రయ్య, గుంద్ర రవీందర్, గుడ్ల రవి,యాడారం బ్రహ్మయ్య, చింతకింది డానియల్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 31న తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సదస్సు

**- కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి**

వేములవాడ, మే 26, మేకార్తి దినపత్రిక ప్రతినిధి

తెలంగాణ ఉద్యమ కళాకారుల ప్రధాన కార్యాలయం వేములవాడ నందు జరిగిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (ఖఖీ) కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కళాతపస్వీ యెల్ల పోశెట్టి గాయకులు మాట్లాడుతూ తేదీ:31-5-2026 ఆదివారం మధ్యాహ్నం 2:00 గంటలకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డా " చీమ శ్రీనివాస్ రావు అధ్యక్షతన బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ హైదరాబాద్ నందు రాష్ట్ర సదస్సుకు ఉద్యమకారులు కళాకారులు కళాకారిని మనులు సాహితీవేత్తలు కవులు రచయితలు కళాకారులు అందరూ పాల్గొనాలని కోరారు అలాగే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించినందుకు ప్రభుత్వం కేకే కమిటీని ఏర్పాటు చేసినందుకు చాలా సంతోషకరమని తెలియజేశారు ముందుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏ.రేవంత్ రెడ్డి కి బీసీ సంక్షేమ శాఖ రవాణా మంత్రివర్యులు పొన్నం




ప్రభాకర్ కి ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు కి కేకే కమిటీ చైర్మన్ మీూజ ప్రొఫెసర్ కోదండరామ్ కి మీూజ అద్దంకి దయాకర్ కి రాములు నాయక్ మాజీ మీూజ కి ఇతర నాయకులందరికీ కళాకారుల రాష్ట్ర కమిటీ పక్షాన కృతజ్ఞతలు కళాభివందనాలు తెలియజేస్తూ ఈనెల 31న జరిగే రాష్ట్ర సదస్సుకు ఉద్యమకారులు కళాకారుల విభాగం వివిధ జిల్లాల అధ్యక్షులు కన్వీనర్లు కోఆర్డినేటర్లు వివిధ మండలాల అధ్యక్షులు కన్వీనర్లు కో కన్వీనర్లు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ సమావేశంలో ఉద్యమ కారుల రాష్ట్ర నాయకులు బొజ్జ కనకయ్య కళాకారుల విభాగం న్యాయ సలహాదారులు నేరెళ్ల తిరుమల గౌడ్ ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ బొడ్డు రాములు దక్షిణ తెలంగాణ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ వెన్నమల్ల వెంకటేష్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యమ కళాకారుల విభాగం అధ్యక్షుడు వారాల దేవయ్య జిల్లా కళాకారుల విభాగం ఉపాధ్యక్షుడు కనపర్తి హన్మండ్లు జిల్లా ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మీనారాయణ జిల్లా కోశాధికారి బుర్రి శంకరయ్య తదితర కళాకారులు పాల్గొన్నారు

## బలగం సినిమా రిపీట్... 60 ఏళ్ల వయసులో పంతాలు విడిచి కలిసిన అన్నదమ్ముళ్లు

మేకార్తి దినపత్రిక మే 26 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



రాజన్న సిరిసిల్ల జిల్లా,కోనరావుపేట మండలం,కొలనూరు గ్రామానికి చెందిన మామిండ్ల నాగయ్య, మామిండ్ల రాములు చిన్నచిన్న మనస్పర్థల కారణంగా 10 ఏళ్ల క్రితం విడిపోయారు.ఒకే గ్రామంలో ఉంటున్నా,అప్పటి నుంచి ఇద్దరూ మాట్లాడుకోవడం మానేశారు.వీరిద్దరిని మళ్లీ కలిపేందుకు నాగయ్య కుమారుడు శ్రీనివాస్ ఎన్నోసార్లు ప్రయత్నించాడు.కానీ ప్రతిసారి విఫలమయ్యాడు.ఇంతలో నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరి మేనల్లుడు కూన తిరుపతి మరణించాడు.మూడు రోజుల కార్యానికి అన్నదమ్ముళ్లు ఇద్దరూ హాజరయ్యారు.ఈ సమయంలో శ్రీనివాస్ గత జ్ఞాపకాలను గుర్తుచేస్తూ,వారిలోని ప్రేమను మళ్లీ రేకెత్తించాడు.ఇద్దరూ కంటతడి పెట్టారు. బిఆరు పదుల వయసులో,"ఇంకెందుకు పంతాలు?"అనుకొని,ఇకనైనా కలిసి బ్రతుకుదామని నిశ్చయించుకున్నారు.వారు ఆలింగనం చేసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ మళ్లీ ఒక్కటయ్యారు.

## UK మేయర్లుగా చరిత్ర సృష్టించిన భారత సంతతి తల్లీకొడుకులు!

మేకార్తి దినపత్రిక మే 26 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



భారత సంతతికి చెందిన తల్లీకొడుకులు యూకేలో ఒకేసారి మేయర్లుగా ఎన్నికై రికార్డు సృష్టించారు.హర్యానాకు చెందిన సునీల్ దహియా కుటుంబం 2013లో బ్రిటన్ వెళ్లి,కేవలం 13 ఏళ్లలోనే ఉన్నత స్థానాలకు చేరింది.ఎల్స్ ట్రీ ఉబోర్ హమ్ వుడ్ టౌన్ కౌన్సిల్కు అతిపిన్న వయస్కుడైన(23) మేయర్గా తుషార్ కుమార్ మే 13న ఎన్నికయ్యారు.ఆ తర్వాత వారం రోజులకే ఆయన తల్లి పర్వీన్ రాణి హెర్ట్స్ మెర్ కౌన్సిల్కు మొదటి భారత సంతతి మహిళా మేయర్గా బాధ్యతలు స్వీకరించారు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్:



మేకార్తి దినపత్రిక మే 26 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

తన జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో పాల్గొని మొక్క నాటిన జర్నలిస్ట్ కలిగోట రవి రెడ్డిమాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా తన పుట్టినరోజు పురస్కరించుకొని హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ లో మొక్క నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాన్ని చేపట్టిన సంతోష్ కుమార్ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతూ నా జన్మదినం సందర్భంగా నా వంతుగా మొక్క నాటడం జరిగింది ఇప్పుడు చూస్తున్న ఉష్ణోగ్రత తగ్గాలి అంటే మనం ఇంకా మొక్కలు నాటాలని తెలిపారు. భావితరాలకు మంచి ఆక్సిజన్ అందించాలని తలపెట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటాలని తెలిపారు.నాకు ఇంత మంచి అవకాశం కలిపించిన మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ కి నా ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

# హమాలీల సంఖ్య పెంచి అన్ లోడింగ్ చేయాలి

- త్వరితగతిన కొనుగోళ్ళు పూర్తయ్యేలా చూడాలి
- వాహనాలు పెంచాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ధాన్యం కొనుగోళ్ళపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్

మేకార్తి దినపత్రిక,మే-26 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

హమాలీల సంఖ్యను పెంచి, ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సరిపడా సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, సేకరించిన ధాన్యం మిల్లులు, గోదాంలకు తరలించి అన్ లోడింగ్ వేగవంతం చేసి నిల్వ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ మంగళవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ, మిల్లులో అన్ లోడింగ్ పై కలెక్టర్ ఆరా తీశారు. మిల్లుల వారీగా ఎంతవరకు ధాన్యం అన్ లోడింగ్ చేశారో వివరాలు అడిగి, హమాలీల సంఖ్య పెంచుకునేలా యజమానులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. లక్ష్యానికి మేరకు రోజూ వారీగా కొనుగోళ్ళ శాతం క్రమంగా పెరిగేలా చూడాలని ఆదేశించారు. వర్షాలు పడే అవకాశం ఉన్న దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న బస్తాలను వెంటనే మిల్లులు, గోదాములకు తరలించేలా తక్షణ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. టార్పాలిన్స్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. గన్నీ బ్యాగులు, కొనుగోలు కేంద్రాల్లో చేస్తున్న ట్యాబ్ ఎంట్రీ, తదితర వివరాలు ఆరా తీశారు. కొనుగోళ్ళు



పూర్తయిన కేంద్రాల నుండి హమాలీలను అపరెల్ పార్క్ కు పంపించి, అన్ లోడింగ్ వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, వాహనాలను ఇతర కేంద్రాలను తరలించాలని సూచించారు.రోజూ వారీగా కొనుగోళ్ళ శాతం పెంచి, సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను తరలించేందుకు ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు.

## కార్మికులను వేదిస్తున్న అధనపు కమిషనర్ సువార్తను సస్పెండ్ చేయాలని, ఇండ్లల్లో పనులు బంద్ చేయాలనీ మున్సిపల్ కార్మికులు ధర్నా

మేకార్తి దినపత్రిక కరీంనగర్ టౌన్ రిపోర్టర్,మంద జయ ప్రకాష్ రెడ్డి మే 26

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో శానిటేషన్ విభాగం బాధ్యత చూస్తున అడిషనల్ కమీషనర్ సువార్త మున్సిపల్ నియమ నిబంధనలకు విరుద్ధంగా కార్మికులను తన సొంత అవసరాలకు ఇండ్లల్లో పనులు చేపించుకుంటూ కార్మికులను మానసిక ఇబ్బందులకు తరుచు గురిచేస్తుంది. ఈనెల 22 తేదీన తన ఇంట్లో జరుగని దొంగతనం నేపం నెట్టి పోలీసులకి అప్పగించి పోలీస్ స్టేషన్లో థర్డ్ డిగ్రీ పెట్టించిన అధిషనల్ కమీషనర్ సువార్త గారిని వెంటనే సస్పెండ్ చేయాలని, కార్మికురాలు కుటుంబాన్ని ఆదుకోవాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట జ×ఖ దీ=ఖ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేశారు.జ×ఖ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్, దీ=ఖ జిల్లా అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నగర పాలక సంస్థ నుండీ జీతాలు తీసుకుంటు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్స్ ఇండల్లో పని పనులు చెయ్యకుండా ప్రజల సొమ్ము కొంతమంది కొరకు దుర్వినియోగం కాకుండా డివిజన్ ల్లో తగినంత సిబ్బంది కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత గల అధికారి తానే నిభందనలుకి వ్యతిరేకంగా కార్మికులను తన ఇంట్లో పనికి పెట్టుకొని వారితో వెట్టిచాకిరీ చేపించుకోవటమే కాకుండా




దొంగతనం నేపం నెట్టి పోలీస్ స్టేషన్లో చిత్ర హింసలు, థర్డ్ డిగ్రీ చేయించిన అధికారి వెంటనే సస్పెండ్ చేయాలి. ఈ ఘటనకి బాధ్యులు అయిన పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.గతంలో నుండే మున్సిపల్ కార్మికులు ఇండ్లలో పనులు చేస్తున్నారని అనేక ఫిర్యాదులు పేపర్ ప్రకటనలు వచ్చిన గత పాలకవర్గం పట్టించుకోలేదు.ప్రస్తుత పాలకవర్గం కూడా అదే ధోరణిలో పనిచేస్తున్నది.అదనపు కమిషనర్ సువార్త గారు మున్సిపల్ శానిటేషన్ కు సంబంధించిన చీపుర్లు కావాలని కార్మికులు అడిగితే దుర్భాషలాడుతూ మోచేతులతో రోడ్లు శుభ్రం చేయాలని చెట్ల కొమ్మలు విరిచి రోడ్లు శుభ్రం చేయాలని ఏ సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకురావద్దని రోడ్లు శుభ్రంగా లేకుంటే మిమ్మల్ని ఉద్యోగం నుంచి తొలగిస్తామని అనేకమార్లు అనేకమంది కార్మికులను ఇబ్బంది పెట్టిన చరిత్ర ఈ అధికారికి ఉన్నది, కార్మికులంటే ఇష్టం లేని అధికారిని వెంటనే సస్పెండ్ చేసి, ఆ దెబ్బలు తిన్న కార్మికురాలు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.అధికారులు ప్రజాప్రతినిధుల ఇండ్లలో పనిచేస్తున్న కార్మికులను డివిజన్లో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సరిపోని డివిజన్లో అదనపు సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేస్తున్నాము. అదరపు కమిషనర్ సువార్త గారిని, పోలీసులను సస్పెండ్ చేసే వరకు మా పోరాటం కొనసాగుతుందని కార్మికుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించే ఏ అధికారికైనా ప్రజాప్రతినిధికైనా వేధింపులు గురి చేస్తే ఇంతకంటే ఎక్కువగా ఉద్యమాలు కొనసాగుతాయని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, జిల్లా అధ్యక్షులు కవ్వంపెల్లి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపెల్లి పోచయ్య, నగర అధ్యక్షులు మల్లేశమ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుంధర్, దీ=ఖ అనుబంధ యూనియన్ నాయకులు నగర అధ్యక్షులు గద్దమ్ సంపత్, డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పొన్నమ్ లింగయ్య, నాయకులు పార్నది ఎల్లయ్య, మాతంగి లక్ష్మణ్ స్వామి చంద్రకళ దాట్ల పద్మ రాయమల్లు జగన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖబర్దార్ కొప్పుల ఈశ్వర్..

- ప్రజల మధ్య ఉంటున్న ప్రజా ప్రతినిధిని నేను..
- మాజీ మంత్రి కొప్పుల పై మంత్రి అడ్లూరి ఫైర్.ధర్మారం:

మేకార్తి దినపత్రిక మే 26 ప్రతినిధి

నోరు ఉందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ప్రజల కోసం పనిచేస్తున్న తనపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి అట్లూరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్యులపై మోయలేని భారం పడుతుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో సంక్షేమాన్ని మరిచిపోయారని మంత్రి అడ్లూరి అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా భవన్ నిర్మాణం చేసుకుంటే కేటీఆర్, హరీష్ రావులు జన్వాడలో ఫామ్ హౌస్ నిర్మాణం చేసుకున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ ఏనాడు విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేయలేదని మంత్రి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో సంక్షేమానికి ఒక వసతిగృహం నిర్మించలేదని మంత్రి ఆరోపించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ధర్మారం మండలంలోని మిగులు భూములను పేద ప్రజలకు పంపిణీ చేస్తామని మంత్రి తెలిపారు.ఇప్పటికే ధర్మారం మండలంలోని బొమ్మ రెడ్డి పల్లి లో 79 ఎకరాలు ప్రభుత్వ భూమిని కబ్జాదారుల కబంధ



హస్తాల నుంచి విడిపించామని నర్సింగాపూర్ లో అనర్హుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను తీసుకొని పేద ప్రజలకు పంపిణీ చేస్తామని మంత్రి తెలిపారు.2023 ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధిగా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల కోసం పనిచేస్తున్నానని మంత్రి అన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తనపై వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారని ప్రజల పక్షాన ఉన్న తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న ఈశ్వర్ కు హితబోధ చేస్తున్నానని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

# రైతాంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోంది

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడ పట్టణంలో రైతు విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం

మేకార్తి దినపత్రిక మే 26 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల,వేములవాడ డివిజన్ అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ ఆత్మ కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న విప్ రైతాంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. మంగళవారం వేములవాడ పట్టణంలోని సినారె కళామందిరంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు..వేములవాడలోని రాజశ్రీ గార్డెన్స్‌లో వేములవాడ సిరిసిల్ల డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. అనంతరం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి సిద్దోగంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు..తదుపరి ఇటీవల వేములవాడ పట్టణానికి చెందిన ఆకుల నరేష్ ప్రమాదవశాత్తు కేదార్నాథ్ లో మరణించిగ విప్ వారి భౌతికయానికి నివాళు లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు..ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్





మాట్లాడుతూ..రైతులకు నూతన పరిజ్ఞానంతో కూడిన వ్యవసాయం, నాణ్యమైన విత్తనం, పంటలలో సలహాలు సూచనలు ఇస్తూ శాస్త్రవేత్తలు నిరంతరం రైతు క్షేమం కోసం పాటుపడాలని కోరారు.వేములవాడ ప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయోగపడే రైతు విజ్ఞాన కేంద్రాన్ని మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, భూసార పరీక్షలు, సాంకేతిక సలహాలు ఒకే చోట అందేలా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.రైతు విజ్ఞాన కేంద్రం కోసం 40 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. జిల్లాకు ఒకటే కేంద్రం మంజూరు కాగా అది వేములవాడకు రావడం అదృష్టకరమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధిలో వెనుకబడిన వేములవాడకు ఇప్పుడు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు.గత రెండేళ్లలో వేములవాడ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయని అన్నారు. ధార్మిక, కార్మిక, వ్యవసాయ రంగాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. నేతన్నల కోసం యార్న్ డిపోను తీసుకువచ్చామని, మహిళా సంఘాల బలోపేతం కోసం 8 వేల వీఓ బిల్డింగ్‌లను వర్చువల్ విధానంలో సీఎం ప్రారంభించారని వెల్లడించారు.పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నియోజకవర్గ పరిధిలో 13 ప్రాంతాల్లో 33/11 సబ్‌స్టేషన్లకు మంజూరు తీసుకువచ్చామని పేర్కొన్నారు.నాకు రాజకీయాల కంటే అభివృద్ధే ముఖ్యం అని వారు స్పష్టం చేశారు... రైతుల సంక్షేమంపై నిజమైన హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందన్నారు. గతంతో పోలిస్తే ఈసారి వరి దిగుబడులు పెరిగాయని, ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు.తడిసిన ధాన్యం ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. అలాగే రైతులు వరి కొయ్యాలను కాల్చకుండా పర్యావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఎమ్యునేటర్లకు సహకరించాలి.

మేకార్తి దినపత్రిక మే 26 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



భారత జనగణన 2027 లో భాగంగా సిద్దిపేట జిల్లా కలెక్టర్ మరియు జిల్లా జన గణన ప్రధాన అధికారి ప్రత్యేక ఆదేశాలతో జిల్లా సమాచార పౌర సంబంధాల సమాచార శాఖ ఇూణ ఆదేశాలతో చేర్యాల పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రజలను చైతన్యం చేయటం జరిగింది . మే 11 న జిల్లాలో జనగణన మొదలయ్యిందని జూన్ 9వరకు ఈ గణన కొనసాగుతుందని ప్రజలందరూ ఇంటికి వచ్చే ఎమ్యూనరేటర్ లకు సహకరించాలని కళాంజలి రాజేష్ బృందం పాటల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యాల అరుణ - బాల్ నర్సయ్య మాట్లాడుతూ ముందుగ ఇండ్ల లెక్కింపు చేస్తారని అనంతరం ప్రజల లెక్కింపు ఉంటుందని పాటల ద్వారా వివరించారు. అంతే కాకుండా ప్రస్తుతం డిజిటల్ జనగణన లో జరుగుతుందని అన్నారు. ఇంటి వివరాలు, కుటుంబ వివరాలు, వృత్తి, వ్యాపారం, వంటి అంశాలపై అధికారులకు సహకరించి అడిగే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అందించాలని కోరారు. పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేందర్ , వైస్ చైర్మన్ ఉమా, కౌన్సిలర్లు సదానందం సుప్రజ, పోతుగంటి ప్రసాద్, ఖాజా, కొమ్ము నర్సింగా రావు, మేనేజర్ ప్రభాకర్, =× కృష్ణ, మరియు ౘా లు, పాల్గొన్నారు.

# సతి సమేతంగా తిప్పాపూర్ రేణుక ఎల్లమ్మ ను దర్శించుకున్న శేఖర్ సేనాపతి దంపతులు

మేకార్తి దినపత్రిక మే 26 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి



మన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ తిప్పాపూర్, ఎల్లమ్మ జమదగ్నిల కళ్యాణ మహోత్సవం మరియు సిద్ధోగం సందర్భంగా ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని సతీసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించిన శేఖర్ సేనాపతి దంపతులు తిప్పాపూర్ రేణుక మాత విస్తరణ మరియు సిద్ధాగం ఘనంగా నిర్వహిస్తున్న ఎల్లమ్మ దేవాలయ కమిటీ ప్రెసిడెంట్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ సేనాపతి గారు సన్మానించి తిప్పాపూర్ గౌడ సోదర సంఘం సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయ పెద్దలు శేఖర్ సేనాపతి గారిని తిరిగి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా శేఖర్ సేనాపతి మాట్లాడుతూ, కోరుకున్న వారికి కొంగు బంగారంగా కొలిచే అమ్మవారు రేణుకా మాత ఎల్లమ్మ ఆశీస్సులు అందరికీ ఉండాలని అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగింది.

# హమాలీల సంఖ్య పెంచి అన్ లోడింగ్ చేయాలి

- త్వరితగతిన కొనుగోళ్ళు పూర్తయ్యేలా చూడాలి
- వాహనాలు పెంచాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ధాన్యం కొనుగోళ్ళపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్

మేకార్తి దినపత్రిక, మే-26 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి



హమాలీల సంఖ్యను పెంచి, ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సరిపడా సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, సేకరించిన ధాన్యం మిల్లులు, గోదాంలకు తరలించి అన్ లోడింగ్ వేగవంతం చేసి నిల్వ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ మంగళవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ, మిల్లుల్లో అన్ లోడింగ్ పై కలెక్టర్ ఆరా తీశారు. మిల్లుల వారీగా ఎంతవరకు ధాన్యం అన్ లోడింగ్ చేశారో వివరాలు అడిగి, హమాలీల సంఖ్య పెంచుకునేలా యజమానులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. లక్ష్యానికి మేరకు రోజూ వారీగా కొనుగోళ్ళ శాతం క్రమంగా పెరిగేలా చూడాలని ఆదేశించారు. వర్షాలు పడే అవకాశం ఉన్న దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న బస్తాలను వెంటనే మిల్లులు, గోదాములకు తరలించేలా తక్షణ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. టార్పాలిన్స్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. గన్నీ బ్యాగులు, కొనుగోలు కేంద్రాల్లో చేస్తున్న ట్యాబ్ ఎంట్రీ, తదితర వివరాలు ఆరా తీశారు. కొనుగోళ్ళు పూర్తయిన కేంద్రాల నుండి హమాలీలను అపరెల్ పార్క్ కు పంపించి, అన్ లోడింగ్ వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, వాహనాలను ఇతర కేంద్రాలను తరలించాలని సూచించారు.రోజూ వారీగా కొనుగోళ్ళ శాతం పెంచి, సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను తరలించేందుకు ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు.

# పద్యకవి వెంకట్ కు శతావధాన సాహితీ పురస్కారం




మేకార్తి దినపత్రిక మే 26 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామానికి చెందిన సంస్కృతభాషా ప్రచార సమితి వరంగల్ , మెదక్,కరీంనగర్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు,ప్రముఖపద్యకవి,వ్యాఖ్యాత డా.బి.వెంకట్ హైదరాబాదులో "ఏకదిన సంపూర్ణ శతావధాన ప్రాశ్నిక సాహితీ సన్మానమును దర్శనమ్ ప్రధాన సంపాదకులు మరుమాముల వెంకటరమణశర్మ,అవధాన విద్యావికాస పరిషత్ వ్యవస్థాపకులు మరుమాముల దత్తాత్రేయశర్మ,అచ్చతెలుగు శతావధాని పాలపర్తి శ్యామలానందప్రసాద్‌శర్మ, అవధానులు- ముత్యంపేట గౌరీశంకరశర్మ,ఓంప్రకాశ్, జి ఆర్ రామశర్మ చేతులమీదుగా అందుకున్నారు.వెంకట్ దత్తపది అంశములో ప్రాశ్నికునిగా పాల్గొని ప్రపంచ యువత సంస్కృతిని మరచి మోబైల్ కు అంకితమై చెడిపోతుందని, సంస్కృత, సంస్కృతి, సంస్కారం,సంస్కరణ అను పదాలను ఇచ్చి,యువతకు పద్యరూపములో మంచి సందేశమును ఇచ్చానని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం,సాహితీ వేత్తలు కవులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి : అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

మేకార్తి దినపత్రిక,మే -26 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు, వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులకు సూచించారు.జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎన్డీపీఎస్ కేసులు, మాదక ద్రవ్యాల సాగు నివారణ చర్యలు, విద్యార్థులు, యువత డ్రగ్స్ వినియోగించకుండా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వ్యక్తులను గుర్తించి వారికి వైద్య సేవలు, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ద్వారా బాధితులకు చికిత్స, మానసిక పరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. అనుమానాస్పద



ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ, విద్యాసంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలపై పోలీస్, ఎక్సైజ్, విద్యాశాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.సమావేశంలో ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శరత్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిని కలిసిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ.

మేకార్తి దినపత్రిక మే 26 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



డిల్లీలో భారత సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయి ని వారి నివాసంలో వీ=రూ అధినేత ' పద్మశ్రీ ' మంద కృష్ణ మాదిగ గౌరవ పూర్వకంగా కలవడం జరిగింది.వారికి పుష్పగుచ్ఛం అందించి శు భాకాంక్షలు తెలుపడం జరిగింది.గతంలో సుప్రీం కోర్టులో చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయి మీద జరిగిన దాడిని నిరసిస్తూ క్షేత్రస్థాయి నుండి డిల్లీ స్థాయి వరకు వివిధ దశల్లో వీ=రూ ఉద్యమ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. అందుకు సంబంధించిన ప్రత్యేక నివేదికను గవాయి కి అందజేయడం జరిగింది.చీఫ్ జస్టిస్ గా సుప్రీం కోర్టులో బెంచ్ మీద వాదనలు వింటున్న బిఆర్ గవాయి మీద ఒక అగంతకుడు బూటు విసిరి దాడికి పాల్పడడం జరిగింది.దళిత సామాజిక వర్గానికి చెందిన జస్టిస్ దీ= గవాయి మీద జరిగిన దాడిని నిరసిస్తూ ' పద్మశ్రీ ' మంద కృష్ణ మాదిగ జాతీయ స్థాయిలో దళిత ఆత్మగౌరవ పోరాటానికి పిలుపునివ్వడం జరిగింది. ఆ పోరాటంలో భాగంగా తహశీల్దార్ కార్యాలయల ముందు ఆందోళనలు, కలెక్టర్ల ముట్టడి , అలాగే వేలాది మందితో హైదరాబాద్ లో దళిత ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఆ తరువాత నవంబర్ 17 న డిల్లీలో పెద్ద ఎత్తున దళిత ఆత్మగౌరవ ప్రదర్శన చేపట్టడం జరిగింది.జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున మహాధర్నాను నిర్వహించడం జరిగింది.జాతీయ స్థాయిలో జరిగిన .ఈ దళిత ఆత్మగౌరవ ఉద్యమ ఘట్టాలను ప్రత్యేక డాక్యూమెంట్ గా రూపొందించడం జరిగింది.ఆ నివేదికను మంద కృష్ణ మాదిగ బిఆర్ గవాయి కి అందించడం జరిగింది.ఈ సందర్భంగా వివిధ సామాజిక అంశాల మీద వారు చర్చించుకోవడం జరిగింది.

## ఏండ్లు గడిచిన ఉపాధి హామీ డబ్బులు రావడం లేదంటూ మందు డబ్బతో ఆందోళన

మేకార్తి దినపత్రిక, మే 26 చందుర్తి మండల రిపోర్టర్.



తమకు చెల్లించాల్సిన బిల్లుల జాప్యాన్ని నిరసిస్తూ ఓ ట్రాక్టర్ యజమాని పురుగుల మందు డబ్బాతో ఎంపీడీవో కార్యాలయం లో బైఠాయించిన ఘటన మంగళవారం చందుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన లాండే సంతోష్ 2025 లో ఉపాధి హామీ పథకం కింద రోడ్ల మరమ్మతులకు సుమారు 200 ట్రిపుల మట్టిని తరలించారు. ఉపాధి హామీ టి ఏ నాగరాజు బిల్లు ఇస్తామంటే పనులు చేశానని డబ్బులు అడుగుతే నాగరాజు తననే బెదిరిస్తున్నాడని బాధితుడు వాపోయాడు,బిల్లు చెల్లింపుల్లో జాప్యం ఉంటుందని మొదటే వివరించిన సంతోష్ నాగరాజు పూచికత్తుతో అగ్రిమెంట్ కుదుర్చుకున్నానని తీరా చూస్తే నాగరాజు చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సుమారు ఏడాది గడుస్తున్న అధికారులు దాటవేసే సమాధానం చెప్పడంతో పాటు పనికి సంబంధించిన ఆధారాలు తీసుకురావాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పని మొదట్లో ఒకలా పూర్తయ్యాక మరోలా వ్యవహరించడమే కాక డబ్బులు చెల్లింపులో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.ఈ విషయమై ఏపీవో రాజయ్యను వివరణ కోరగా పనులకు సంబంధించిన పేమెంట్ రికార్డ్ చేశామని,డబ్బులు రాగానే చెల్లిస్తామని తెలిపారు

## వడ్డీ వ్యాపారి అరెస్ట్....

వేములవాడ, మే 26, మేకార్తి దినపత్రిక ప్రతినిధి :



ఉదయం రుద్రంగి ఎస్సై ఎం మోతీరాం కి వచ్చిన నమ్మదగిన సమాచారంపై రుద్రంగి గ్రామంలోని దువ్వాక గంగ శేఖర్ తండ్రి నరసయ్య అను అతను తన ఇంటిలో అధిక వడ్డీల వ్యాపారం నడిపిస్తున్నాడని అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి ప్రజలను ఇబ్బంది గురి చేస్తున్నాడని నమ్మదగిన సమాచారం రాగా రుద్రంగి ఎస్ఐ గారు తన సిబ్బందితో కలిసి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు దువ్వాక గంగ శేఖర్ ఇంటికి వెళ్లి తనిఖీలు చేయగా అతని ఇంటిలో 32 ప్రామిసరీ నోట్స్ వాటి విలువ సుమారు 70 లక్షలు, 5 చెక్కులు మరియు రెండు బాండ్ పేపర్లు లభించగా వాటిని స్వాధీనం చేసుకొని అట్టి వ్యక్తిని పిఎస్ కి తీసుకొని వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. ఇకపై ఎవరు అధిక వడ్డీ వ్యాపారం నడిపి సాధారణ ప్రజలకు ఇబ్బంది గురిచేసిన వారిపై చట్టపరిచే చర్యలు తీసుకుంటామని, ఎవరైనా అధిక వడ్డీ వ్యాపారం ఎవరు నడిపిన వారి వివరాలు ఎవరైనా తెలిపినట్లు ఉంటే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని రుద్రంగి ఎస్సై తెలపడం జరిగింది

## కేంద్రీయ విద్యాలయానికి నర్సింగాపూర్ లో స్థలం కేటాయింపు..

**- జగిత్యాలను ఎడ్యుకేషన్ హబ్ గా మార్చడం లక్ష్యం..**

**- రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**

మేకార్తి దినపత్రిక మే 26 జగిత్యాల

జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి నర్సింగాపూర్ శివారులోని సర్వే నెంబర్ 437లో స్థలం కేటాయించినట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో పాటు కలిసి నర్సింగాపూర్ లోని కేంద్రీయ విద్యాలయానికి కేటాయించే తలపెట్టిన స్థలాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి ఇన్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేయాలని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆలోచన చేసి ముందుకు సాగుతున్నారని మంత్రి తెలిపారు. జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని నర్సింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం 6 ఎకరాల స్థలాన్ని సర్వే నెంబర్ 437లో కేటాయిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఇప్పటికే రూ. 33 కోట్లతో ఐటిఐ, ఈ ఏటీసీ సెంటర్ ను ఇక్కడ ఏర్పాటు చేశామని వృద్ధ ఆశ్రమం సైతం ఇక్కడే ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్ గా మారుతుందని మంత్రి తెలిపారు. చల్ గల్ లోని వ్యవసాయ పరిశోధనకు సంబంధించిన వాలంతరీ భూములను 12 ఎకరాలు కేంద్రీయ విద్యాలయానికి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కి కేటాయించడం జరిగిందని మంత్రి వివరించారు. కేంద్రీయ విద్యాలయానికి రెండు ఎకరాల స్థలం సరిపోదని వివాదం నేపథ్యంలో నర్సింగాపూర్ లో ప్రభుత్వ భూమి కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర రైతుల



ప్రయోజనాల కోసం చల్ గల్ మరిన్ని వ్యవసాయ పరిశోధనలు జరగాల్సిన నేపథ్యంలో వ్యవసాయ పరిశోధనల భవిష్యత్తు అవసరాల కోసం అక్కడి భూములను అంతకు మించి కేటాయించే అవకాశం లేదని మంత్రి తెలిపారు. నర్సింగాపూర్ భూముల ప్రతిపాదనలు జిల్లా అధికారుల ద్వారా కేంద్రీయ విద్యాలయ అధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందని ఎందుకు నిజామాబాద్ ఎంపీ అరవింద్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సహకరించాలని మంత్రి కోరారు.

## నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం,ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై పోలీసుల ఉక్కుపాదం.

**- అక్రమ ఫైనాన్స్,వడ్డీ దందాలపై జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఏకకాలంలో ఆకస్మిక దాడులు.**

**- అధిక వడ్డీలతో ప్రజలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు..**

**- అనుమతులు లేకుండా ఫైనాన్స్,వడ్డీ వ్యాపారం చేస్తే కేసులు నమోదు.**

**- 06 కేసులు నమోదు, రూ.1,39,65,000/- విలువ గల వివిధ డాక్యుమెంట్లు,1,77,000 ,విలువ గల బంగారు,వెండి ఆభరణాలు స్వాధీనం.**

**- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**

మేకార్తి దినపత్రిక మే 25 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై మంగళవారం రోజున ఉదయం పోలీసులు 15 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో అక్రమ వడ్డీ వ్యాపారం,ఫైనాన్స్ నిర్వహిస్తున్న



వారిపై 06 కేసులు నమోదు చేసి రూ.1,39,65,000/- విలువ గల వివిధ డాక్యుమెంట్లు,1,77,000 విలువ గల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఒక ప్రకటనలో తెలిపారు జిల్లాలో అనుమతులు లేకుండా ఫైనాన్స్ నిర్వహించడం, అధిక వడ్డీలతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ..ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుండి అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలు తమకున్న ఉన్న అత్యవసర పరిస్థితి,తాత్కాలిక అవసరాల కోసం అధిక మొతంలో అవసరాలకు మించి అధిక వడ్డీలకు అప్పు చేసి ఆతరువాత అప్పులు,అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయవద్దని ఎస్పీ గారు కోరారు.ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్దతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలని ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకపోయిన అక్రమ ఫైనాన్సు వ్యాపారం నడిపేవారి వివరాలు జిల్లా పోలీస్ కార్యాలయంలో తనకు సమాచారం ఇవ్వొచ్చు అని,అలాగే స్థానిక పోలీసు వారికి పిర్యాదు చేయాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడం లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు.అధిక వడ్డీ రేట్లతో సామాన్యుల పై దౌర్జన్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా జిల్లా ఎస్పీ గారు హెచ్చరించారు.

## ఈనెల 31న తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సదస్సు

**- కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి**

వేములవాడ, మే 26, మేకార్తి దినపత్రిక ప్రతినిధి

తెలంగాణ ఉద్యమ కళాకారుల ప్రధాన కార్యాలయం వేములవాడ నందు జరిగిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (ఞఖఫీ) కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కళాతపస్వీ యెల్ల పోశెట్టి గాయకులు మాట్లాడుతూ తేదీ:31-5-2026 ఆదివారం మధ్యాహ్నం 2:00 గంటలకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డా " చీమ శ్రీనివాస్ రావు అధ్యక్షతన బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ హైదరాబాద్ నందు రాష్ట్ర సదస్సుకు ఉద్యమకారులు కళాకారులు కళాకారిని మనులు సాహితీవేత్తలు కవులు రచయితలు కళాకారులు అందరూ పాల్గొనాలని కోరారు అలాగే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించినందుకు ప్రభుత్వం కేకే కమిటీని ఏర్పాటు చేసినందుకు చాలా సంతోషకరమని తెలియజేశారు ముందుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏ.రేవంత్ రెడ్డి కి బీసీ సంక్షేమ శాఖ రవాణా మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ కి ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు కి కేకే కమిటీ చైర్మన్ మీజ ప్రొఫెసర్ కోదండరామ్ కి మీజ అద్దంకి దయాకర్ కి రాములు నాయక్ మాజీ మీజ కి ఇతర నాయకులందరికీ కళాకారుల రాష్ట్ర కమిటీ పక్షాన కృతజ్ఞతలు కళాభివందనాలు తెలియజేస్తూ ఈనెల 31న జరిగే రాష్ట్ర సదస్సుకు ఉద్యమకారులు కళాకారుల విభాగం వివిధ జిల్లాల అధ్యక్షులు కన్వీనర్లు కోఆర్డినేటర్లు వివిధ మండలాల అధ్యక్షులు కన్వీనర్లు కో కన్వీనర్లు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ సమావేశంలో ఉద్యమ కారుల రాష్ట్ర నాయకులు బొజ్జ కనకయ్య కళాకారుల విభాగం న్యాయ




సలహాదారులు నేరెళ్ల తిరుమల గౌడ్ ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ బొడ్డు రాములు దక్షిణ తెలంగాణ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ వెన్నమల్ల వెంకటేష్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యమ కళాకారుల విభాగం అధ్యక్షుడు వారాల దేవయ్య జిల్లా కళాకారుల విభాగం ఉపాధ్యక్షుడు కనపర్తి హన్మండ్లు జిల్లా ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మీనారాయణ జిల్లా కోశాధికారి బుర్రి శంకరయ్య తదితర కళాకారులు పాల్గొన్నారు

## మంత్రి పొన్నం ప్రభాకర్

మేకార్తి దినపత్రిక, మే 26 జగిత్యాల జిల్లా ప్రతినిధి

జగిత్యాల లో రైతుల పక్షాన ప్రశ్నించిన అశోక్ అనే డ్రైవర్ ని తొలగించారని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం..అతను కేవలం



ఆర్టీసీ హైర్ (కిరాయి)బస్సు డ్రైవర్.. ఆర్టీసీ ఉద్యోగి కాదు. అయినప్పటికే అతన్ని ఉద్యోగం నుండి తొలగించవద్దని బస్సు యాజమాన్యానికి సూచించాం,అశోక్ రైతుల పక్షాన మాట్లాడారు ,అది స్వాగతిస్తున్నాం కేంద్రం ధాన్యం కొనుగోలు లో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది.. అయినప్పటికీ కొనుగోళ్లు సాఫీగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చర్యలు తీసుకుంటోంది. ఈ అంశాన్ని ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేయవద్దు.

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com